


# కారా కిళ్లీ

౩

పరమ శివుడు గరళాన్ని గొంతు మధ్యలో వుంచేసి, లోక కల్యాణం గావించేడని పురాణ గాథ. గరళం కడుపులోకి వెళ్ళిపోతే శివుడికి డేంజరు. పోనీ ఊసేద్దామంటే లోకానికి డేంజరు. అందుచేత ఉభయ పక్షాల క్షేమాన్ని కాంక్షించి మధ్యలో వుండి పొమ్మని అర్డరేసి వుంటాడు. గరళం సంగతి అట్లా వుంచేయండి. కారా కిళ్ళీ పరిస్థితి కూడా ఇంచుమించు అట్లాగే వుంటుంది. మింగనూ లేము, కక్కనూ లేము. బుగ్గను అలంకార ప్రాయంగా వుండిపోతుంది. అందుచేత కారా కిళ్ళీ వేసుకున్న ప్రతి పెద్ద మనిషి నా కంటికి పరమ శివుడులా కనిపిస్తుంటాడు.

నా మాట కొస్తే ఇప్పటి కొచ్చి నాకు కారా కిళ్లీ అలవాటు కాలేదు. ఆ మాట వింటే చాలు కళ్ళు తిరుగుతాయి. హైస్కూలు రోజుల్లో దొంగ

చాటుగా సిగరెట్లు కాల్చుకునే వాడిని. సిగరెట్టుతోపాటు కారా కిళ్ళీ కూడా వుంటే మజాగా వుంటుందని ఎవడో చెప్పేడు. పాండు కిళ్ళీషాపులో సిగరెట్టు కొనుక్కుంటూ కారా కిళ్ళీ కూడా కట్టించుకున్నాను. తిన్నగా పార్కులోకి వెళ్ళి ఒక మూలగా కూచుని కిళ్ళీ వేసుకున్నాను. మెల్లిగా సిగరెట్ ముట్టించేను. పొగ వల్ల నమలడం కుదరలేదు. పొగని గుండెల్లోకి లాగుతుండగా కిళ్ళీరసం కూడా గొంతు లోంచి జారిపోయింది. ఇంకంతే. కూచున్న వాడ్ని కూచున్నట్టే వుండగా భూమి నా చుట్టూతా చక్కర్లు కొడుతున్నట్లు ఫీలింగు కలిగింది. నేను దూది పింజనై పోయాను. రెక్కలు లేకపోయినా ఎగిరి పోతున్నట్లు భ్రమ. ఎగరకుండా భూమిని పట్టుకోబోయి బోర్లాపడి పోయేను. సమయానికి ఫ్రెండ్సు వచ్చి ఆదుకున్నారు. సోడా తాగించేరు. చాలా సేపటిగ్గాని నా ఆరోగ్య పరిస్థితి బాగు పళ్ళేదు. అదుగో అప్పట్నుంచి కారా కిళ్ళీ అంటే బెదురు నాకు.

కారా కిళ్ళీలో ఏం కిక్కుందో ఏం పాడో గాని, డజనో, అరడజనో కట్టించుకొని బజ్జీలు తీసుకెళుతున్నట్లు పొట్లాల్లో పట్టుకెడుతుంటారు జనం. గంటకోటి చప్పున బుగ్గ వేసుకోకపోతే తోచదు వాళ్ళకి. రోజు కిరవై కిళ్ళీలు వేసేవాళ్ళని కూడా చూసేన్నేను. టైంకి కిళ్ళీ పడకపోతే నరాలు లాక్కుపోతాయట. గోవిందని నాకో ఫ్రెండున్నాడు. అతనికి జాతి కిళ్ళీల మీద వల్లమాలిన ప్రేమ. అతనికి పెళ్ళయిన కొత్త రోజుల్లో తన కోసం కారా కిళ్ళీ కట్టించుకుని వాళ్ళావిడకు మీఠా కట్టించేడు. రెండూ జేబులో వేసుకుని సైకిలెక్కేడు. ఆ రాత్రి భోజనాలైన తర్వాత దంపతులిద్దరూ కిళ్ళీలు వేసుకున్నారు. గోవిందుడుకిళ్ళీని బుగ్గన పెట్టుకుంటాడేగానీ చప్పుననమలడు. ఆవిడ మాత్రంకసాపిసా నమిలేసి కళ్ళుతేలవేసిందట. భళ్ళున వాంతిగూడా చేసుకుంటే పక్కగదిలో వున్న అత్తగారు కోడలు పిల్లకి నెల తప్పిందని తెగ మురిసిపోయిందట. ఇంతకీ జరిగిందేమిటంటే గోవిందు కిళ్ళీ అతని వైఫ్‌కి వెళ్ళి ఆవిడగారి కిళ్ళీ గోవిందు బుగ్గన చేరింది. అప్పట్నుంచీ గోవిందు చాలా జాగ్రత్తగా ఉంటున్నాడు. ఇంటికి ఎప్పుడు కిళ్ళీలు తీసుకెళ్ళినా వాటిమీద కాగితం చుట్టి 'నాది' 'నీది' అని రాసుకుంటున్నాడు.

కిళ్ళీ షాపుల్ని చిన్న చూపు చూడటానికి వీల్లేదు. ఫలానా షాపులో కిళ్ళీలు బ్రహ్మాండంగా కడుతున్నారనే టాక్ పడాలేగాని టర్నోవర్ దృష్ట్యా ఆ షాపు ముందు ఫేన్సీ షాపు కూడా పనికిరాదు. అంత బేరాలొస్తాయి. జబర్దస్తీగా వెలిగే కిళ్ళీ షాపుల్లో ఫేనుంటుంది. రేడియో వుంటుంది. రకరకాల సిగరెట్లుంటాయి. రకానికో కిళ్ళీ దొరుకుతుంది. కిళ్ళీలలో వెరైటీ, రుచులు కావాలంటే బందరో, బెజవాడో వెళ్ళాలి. అయిదు రూపాయల కిళ్ళీలూ, పెళ్ళి కొడుకు కిళ్ళీలూ విరివిగా దొరుకుతుంటాయక్కడ. రకాలెన్ని వున్నా కిళ్ళీలలో కారా కిళ్ళే కింగు.

కారా కిళ్ళీలో ఏం సుఖమో నాకు తెలియదు, గానీ గొప్ప ప్రయోజనం వుందని కొందర్ని చూసి తెలుసుకున్నాను. పదిమంది పది రకాలుగా వాదించుకుంటూ మాటాడుతున్నప్పుడు మనం కారా కిళ్ళీ బిగిస్తే బెటరు. ఆటోమేటిగ్గా నోటికి తాళం పడిపోతుంది. పిచ్చి వాగుడు మన నుంచి వెళ్ళదు. వాళ్ళ మాటలు వింటూ బుగ్గన కిళ్ళీ పెట్టుకుని తలూపుతూ కూచుంటే మన సొంత అభిప్రామేమిటో దేవుడికూడా తెలీదు. మాట్లాడవేమిట్రా అని మనల్ని ముగ్గులోకి లాగే ప్రయత్నం చేస్తే, నోట్లో కిళ్ళీ వుందని సైగచేసి తప్పించుకోవచ్చు.

కొందరు సినీ దర్శకులు ఈ పద్ధతినే ఫాలో అవుతున్నారు. స్టోరీ రైటర్తో డిస్కషన్సు జరిగేప్పుడు ఎక్కడో పాయింటు వస్తుంది. నీది తప్పంటే రైటర్కి కోపం, మీది తప్పంటే నిర్మాత క్కోపం. అందుచేత ఆ పాయింటొచ్చినప్పుడు గబుక్కునకిళ్ళీ బుగ్గన పెట్టేస్తారు డైరక్టర్లు. ఇద్దరి ఆర్గుమెంట్లూ కరెక్టేనని మవునం ద్వారా తెలియ జేస్తారేగాని ఫలానా వారిదియమ కరక్టని చస్తే కమిట్ కారు. కనుకేమిటంటే వాద, వివాదాలు ఎదురైనప్పుడు మనకి అలవాటు లేకపోయినా, ముందు జాగ్రత్తకోసం కారా కిళ్ళీ బిగించడం ఉత్తమమైన మార్గమని మనం గుర్తించాలి.